క్లుప్తంగా

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి..



వ్యవసాయశాఖ అసిస్టెంట్‌ను సన్మానిస్తున్న ఏఓలు నీలిమ, శ్రీనివాసరావు

పూసపాటిరేగ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పెదబయిలు వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్‌గా పనిచేసి గుంటూరు బదిలీపై వెళ్తున్న మహేంద్రనాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైతులకు చిత్తశుద్ధితో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పూసపాటిరేగ మండల వ్యవసాయశాఖ అధికారి కె. నీలిమ, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సిరిసహస్ర, ప్రదీప్‌నాయుడు దంపతులు

విజయనగరం: నగరంలోని కొత్తపేట సంపత్ వినాయకుని ఆలయంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర, ప్రదీప్‌నాయుడు దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సుమారు నాలుగు వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు జగదీష్, శివ, అభిరాం, నవీన్, దక్షిణామూర్తి, హేమంత్, చాట్ల రమణ, కృష్ణ, అప్పారావు, జగన్, అప్పలనాయుడు, పకీరు, సాయి, రామకృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి



కనకమహాలక్ష్మి అమ్మవారు

విజయనగరం టౌన్: పట్టణంలోని సిటీ బస్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తుల స్వహస్తాలతో గోరింటాకుతో పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభాగ్యురాలికి అండగా..



అంబులెన్సులో మహిళను విశాఖ తరలిస్తున్న వన్‌స్టాప్ సెంటర్, పోలీస్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని ఎత్తు బ్రిడ్జిపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న ఓ మహిళకు దిశ వన్‌స్టాప్ సిబ్బంది అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే... ఎత్తు బ్రిడ్జిపై మతిస్థిమితం లేని ఓ మహిళ కొద్ది రోజులుగా తిరుగాడేది. దీంతో దిశ వన్‌స్టాప్ సిబ్బంది వన్‌టౌన్ పోలీసుల సహాయంతో ఆమెను వన్‌స్టాప్ సెంటర్‌కు తీసుకెళ్లి నాలుగురోజులు సంరక్షించి, శనివారం ఆమెను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆమెకు చికిత్స అందజేసి, విశాఖ మానసిక వైద్యశాలకు రిఫర్ చేశారు. ఆ మహిళ మానసిక పరిస్థితి బాగోలేకపోవడం వల్ల వివరాలు తెలియరాలేదని వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పరవాడ సాయి విజయలక్ష్మి తెలిపారు.

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన

- చేసిన అభివృద్ధి, సంక్షేమం చెప్పి ఓట్లు అడుగుతున్నాం..
- టీడీపీ నాయకుల్లా అబద్ధాలు చెప్పాల్సిన అవసరం లేదు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- దాసన్నపేటలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అవినీతి రహిత పాలన సాగుతోందని డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరించి ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5, 7 డివిజన్ పరిధిలో గల దాసన్నపేట, సుద్దవీధి, నవాబ్‌పేట ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించగా... స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ రెండు ఓట్లను వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. 2019 ఎన్నికలకు ముందు మంచినీటి కోసం దాసన్నపేట వాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లేవారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటర్ ట్యాంక్ నిర్మించి కార్పొరేషన్ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయడంతో తాగునీటి ఇబ్బందులు తీరాయని చెప్పారు. దాసన్నపేట ప్రాంతంతో పాటు మరో 10 ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌లు నిర్మించామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో పేద విద్యార్థులు సైతం మంచి చదువులు చదువుకునే అవకాశం కలిగిందని తెలిపారు. దాసన్నపేట వాటర్ ట్యాంక్‌ను టీడీపీ హయాంలో నిర్మించామంటూ ఆ పార్టీ నేతలు అబద్ధపు ప్రచారం సిగ్గు చేటని.. ట్యాంక్ వద్ద ఉన్న శిలాఫలకాలతో పాటు కార్పొరేషన్ రికార్డులను చూసుకుని మాట్లాడాలని హితవు పలికారు. విలువల్లేని వ్యక్తులు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తోన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నగరంలోని 23 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరిట అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని జోష్యం చెప్పారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, గాదం మురళి, ఆల్తి సత్యకుమారి, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేఏపీ రాజు, కోరాడ రాజు, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ : ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి ఎన్నికల కోడ్ అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, ప్రైవేట్ స్థలాలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలుంటే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతిఒక్కరూ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఎన్నికల స్క్వాడ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మి జయంత్యుత్సవాలు



ఉత్సవ ప్రతులను ఆవిష్కరిస్తున్న ధర్మకర్తలు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో ఉన్న భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో ఆదివారం నుంచి మహాలక్ష్మి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9 గంటలకు ఆదిలక్ష్మి దేవికి పంచామృత అభిషేకాలు, తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు ఐశ్వర్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు ఉంటాయని తెలిపారు. భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఉత్సవ ప్రతులను ఆవిష్కరించారు.

అమ్మవార్ల జాతరకు ఏర్పాట్లు



భోగాపురం కనకదుర్గమ్మ తల్లి ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాటాకుల పందిరి

భోగాపురం: మండలంలోని పోలిపల్లి, భోగాపురం గ్రామాల్లో పైడితల్లి, కనకదుర్గమ్మ అమ్మవార్ల జాతర్లకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 25, 26, 27 తేదీల్లో అమ్మవార్ల జాతరలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న జాతరలలో భాగంగా మంగళ, బుధవారాల్లో లక్షల సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భోగాపురంలో కనకదుర్గమ్మతల్లి ఆలయ ధర్మకర్త కందుల రఘుబాబు, కమిటీ సభ్యులు కొమ్మూరు సుభాషణరావు, బుల్లయ్య, ఆళ్ల విశ్వేశ్వరరావు.. పోలిపల్లి ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, తదితరులు ఏర్పాట్లు చేశారు. ఆలయాల ప్రధాన ముఖ ద్వారం వద్ద తాటాకుల పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు (ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు) ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు

విజయనగరం: ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా ఈ నెల 24,25 (ప్రభుత్వ సెలవు రోజులు అయినప్పటికీ) తేదీల్లో పన్ను వసూలుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31తో ఆర్థిక సంవత్సరం గడువు ముగియనుండడంతో మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక కౌంటర్‌ల ద్వారా పన్నులు వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆస్తి పన్ను చెల్లించని బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ శాఖ ప్రకటించిన వడ్డీ రాయితీ ఆఫర్‌ను పన్ను మొత్తాన్ని సకాలంలో చెల్లించి వినియోగించుకోవాలని కోరారు.

41 మంది గైర్హాజరు

నెల్లిమర్ల: మండలంలోని ఎనిమిది కేంద్రాల్లో శనివారం జరిగిన పదో తరగతి సైన్స్ పరీక్షకు 41 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ యూఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సతివాడ మోడల్ స్కూల్, అలుగోలు, పారసాం, మొయిద, రామతీర్థం, ఎంజేపీ బీసీ రెసిడెన్షియల్, నెల్లిమర్ల ఉన్నత, బాలికోన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. ఆయా కేంద్రాలను ఎంఈఓ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

విజయనగరం అర్బన్: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ. ఆనంద్ పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉడా కాలనీ ఫేజ్-3 వాకర్స్ పార్కులో శనివారం మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనంతో పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు పి.శివాజీ, వాకర్స్ సభ్యులు మోహన్ దత్త, ఆనందరావు, పార్కు నిర్వాహకులు అచ్యుతరావు, శామ్యూల్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



బాబామెట్ట ఖాదర్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న టూటౌన్ సీఐ కోరాడ రామారావు, తదితరులు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావు కోరారు. పట్టణంలోని బాబామెట్ట, దాసన్నపేట, తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..



కోట వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: వైజాగ్‌లో 25 వేల కిలోల డ్రగ్స్ రవాణా చేస్తూ దొరికిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి. రాము, జిల్లా ఉపాధ్యక్షుడు జె. రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎం. సౌమ్య, కె. రమేష్, సోమేష్, లోకేశ్వరి, భారతి, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లికార్జునరావు

డెంకాడ: రెండు నిమిషాలు కంటే ఎక్కువ సేపు బ్రష్ చేయరాదని నెల్లిమర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ దంతవైద్యుడు మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దంత సంరక్షణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సూచించిన సాఫ్ట్‌బ్రష్‌లు, పేస్ట్‌లను మాత్రమకే వినియోగించాలని సూచించారు. చాక్లెట్లు వంటి పదార్థాలు తినడం వల్ల దంతాలు పాడయ్యే అవకాశం ఉందన్నారు. పీచుపదార్థాలు ఎక్కువగా తినాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వీవీఏ నరసింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్వారీల అనుమతులు రద్దు చేయాలి



డీటీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న రామచంద్రపేట, కొండ్రాజుపాలెం గ్రామస్తులు

భోగాపురం: గ్రామాల సమీపంలో నడుపుతున్న క్వారీల అనుమతులను రద్దు చేయాలని రామచంద్రపేట, కొండ్రాజుపాలెం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం ఎస్.శ్రీనివాసరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్వారీల్లో బాంబ్ బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్ల పెచ్చులూడుతున్నాయన్నారు. అలాగే దుమ్ము, ధూళి వల్ల తాగునీరు కలుషితమై అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుక్క రాము, కోలా రామసూరి, సూరాడ చిన్నారావు, అప్పలకొండ, నరసమ్మ, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం..

- నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మద్ది అప్పలరాజు



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



విజయనగరం ఫూల్‌బాగ్: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మద్ది అప్పలరాజు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని శనివారం స్థానిక వైఎస్సార్‌నగర్ కాలనీలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ పాలకులు దేశభక్తి ముసుగులో దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే అమరులకు మనమిచ్చే అసలైన నివాళులని చెప్పారు. కార్యక్రమంలో కె. శ్రీను, కె. భాస్కరరావు, జి. నాగరాజు, రాఘవ, డి. రాంబాబు, గిరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొండగుంపాంలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు,సుఖదేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. దేశం కోసం పోరాడి చిన్నతనంలోనే ప్రాణాలు కోల్పోయారంటూ అమరుల సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు, నాయకులు ఆదినారాయణ, నడిపేన రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ/దత్తిరాజేరు: వేపాడ మండలంలోని బక్కునాయుడుపేట, దత్తిరాజేరు మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రిన్సిపాళ్లు రావాడ ఈశ్వర రావు, ప్రసన్నలక్ష్మి శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదివిన విద్యార్థులు అర్హులని, ఈనెల 31వ తేదీలోగా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ. జీఓవీ.ఇన్ వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, ఆధార్ కార్డు , స్టడీ సర్టిఫికెట్లను మోడల్ స్కూళ్లలో అందజేయాలని వివరించారు. ఓసీ,బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మోడల్ స్కూళ్లలో ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందని తెలిపారు. దత్తిరాజేరు మండలం విద్యార్థులు మరింత సమాచారం కో సం 91779 51662, 80086 04619 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు...

కొత్తవలస: మండలంలోని అర్జున్నపాలెం సమీపంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శివప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈనెల 28 నుంచి మే22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ,సీఈసీ, బైపీసీ,ఎంఈసీ ఆంగ్ల మాధ్యమం గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మార్కులతో పాటు రూల్ రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో తనిఖీలు

గజపతినగరం: మండలంలోని జిన్నాం గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ (డీపీహెచ్ఎన్ఓ) ఎం.సత్యవతి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. వెల్‌నెస్ సెంటర్‌లో ప్రజలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాల విద్యార్థు లను పిలిపించి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది పాఠశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసు కున్నారు. ఆమె వెంట ఎస్ఓ ధర్మారావు, డీపీఓ నాయుడు, మరుపల్లి పీహెచ్‌సి సిబ్బంది ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కేజీబీవీలో క్షయ వ్యాధిపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేపాడ పీహెచ్‌సీ డాక్టర్ ధరణి మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం వేళ జ్వరం వచ్చినా వెంటనే కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. బ్యాక్టీరియా వల్ల సంక్రమించే క్షయ వ్యాధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరు నుంచి ఎనిమిది నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నయమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎస్ రమణ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.